# ఓరి నాయనా!

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారు

౧

హిదాయత్ ఉల్లాకు పిల్లలు లేరు. పిల్లలు లేరని తాను గాని తనభార్య సాకినా గాని యెన్నఁడును అనుకొనిన పాపమునఁ బోలేదు. కాని ఈ చింత బందుగులకుఁ గలిగెను. దాపు కుటుంబములకు బందుగులే అధిదేవతలు!

హిదాయతుల్లాకు దగ్గఱచుట్టములు పలువురు కలరు. వారిలోఁ గొంత కొంత మందికి ఈ చింత ఉదయించెను. అతనికి దూరబంధువులును పలువురు కలరు. వారికిని ఈ చింత యుండెను. సుదూరబంధు వయినను రుస్తుం సాహెబుకే ఈచింత చాల నెక్కువ అని చెప్పవలయును. ఏల? రోజురోజుకు పెరిఁగి పోవుచున్న ఒకచక్కని కన్నె అతనికడఁ గలదు. రుస్తుంసాహెబు హిదాయతుల్లావారి బైఠక్ ఖానాలో * జీతనాతములు లేని పెద్దయుద్యోగి.

చక్కని కన్యగల ప్రతివానికిని ఈ చింత చింతవలె పెరిఁగిపోయెను.

పెరిఁగిపోయెను సరియ. దాన నేమి లగ్గు? హిదాయతుల్లా సామాన్యుఁడా? సముద్రుఁడు. తమకుఁగల చింత మనవి చేసికొనుటకు ఎవనికిని గుండెకాయ లేదు.

లేదు సరియ. లేదనిన నెటులు? చింత పుట్టనే కూడదు. పుట్టెనుబో పిఱికిగుండె నుండియో మొఱికిగుండె నుండియో బయటఁ బడవలయును. పొగ పుట్టినచోట నుండునా?

హిదాయతుల్లా నవాఁజు చేసికొని బైఠక్ ఖానాలోఁ గూరుచుండి తేటమొగముతో ఖురాను ఏకరువు పెట్టఁదొడఁగెను. అపుడు రుస్తుంసాహెబు 'జహాఁపనా! ఖురాను త్రేఁచిన మహాపురుషు లొకరు మనపత్తనమున వేంచేసి యున్నారు' అనెను. హిదాయతుల్లా వెంటనే లేచి పడమటిదిక్కు తిరిగి ముమ్మాఱు సలాము చేసి 'ఎంత అవినయము జరిగిపోయినది? లెండు లెండు! దర్శనము చేసివత్తము' అనెను. అనఁగనే రుస్తుంసాహెబు 'అరే బజ్జూ! గాడీ గాడీ' అని అఱచెను. హిదాయతుల్లా 'వద్దు' అని నిష్కర్షగా చెప్పి 'నడచియే పోవలయును' అనెను. రుస్తుంసాహెబు 'చిత్తము' అనెను.

రుస్తుంసాహెబు ముందు నడవఁగా హిదాయతుల్లా వెనుక నడవఁదొడఁగెను. వారిని జూచినవా రందఱును వింతతో వారివెంట నడవ దొడఁగిరి.

వారు వెళ్ళిన దొకమఠము. అందొకఁడు కనులు మూసికొని కూరుచుండెను. గడ్డముచే నతని అధఃకాయ మగపడుట లేదు. మొగమున విభూతి, తలకు రుమాలు, ఒకప్రక్క ఖురాన్, ఒకప్రక్క గీత. చూచుచునే హిదాయతుల్లా అల్లాకు చేయఁదగిన గౌరవము చేసెనుగాని ఆమహాపురుషుఁడు కనులు తెఱచి

* కఘుర్ల • కచేరీ.

యుండలేదు. కనులు మూసికొన్నను మహాత్ములకు దివ్యదృష్టి యుండదా?

రుస్తుంసాహెబు ఫకీరును సమాధినుండి లేపఁ బ్రయత్నించెను. హిదాయతుల్లా అతని చాపలమును చేతితో సులువుగా వారింపఁ గలిగెను. హిదాయతుల్లాతోపాటు వచ్చినవారందఱును ఆ మహాపురుషుని యెదుట మోఁకరిల్లియుండిరి.

హిదాయతుల్లా-ఓపికను ఆ మహాత్ముఁడు లెస్సగా పరీక్షించి విసికెను. కనులు సగము తెఱచియు మూసియు తెఱచియు మూసియు తుదకు ఈ ప్రపంచకమును చూడఁగలిగెను.

హిదాయతుల్లా ఫకీరులకు చేయు ఉపచారములు చేయుచుండెను. రుస్తుంసాహెబు ఊరక కూరుచుండలేదు. 'పాదుషా తరువాత పాదుషా, మహమ్మదు తరువాత మహమ్మదు ఎవరనఁగా ఈ హిదాయతుల్లా!' అని ఉల్లాకు పరిచర్యచేయుచుండెను. హిదాయతుల్లా వెనుకకు నడచినచో రుస్తుం వెనుకకు నడచెను. ముందరికి నడచినచో ముందరికి నడచెను. వంగినచో వంగెను. లేచినచో లేచెను.

అది చూచి ఫకీరు ఇటు లనెను—'ఇతఁడు ఉల్లా యగుచో నీవు అల్లా.'

ఉల్లా పెదవులమీఁద లేనగవు తళుక్కుమనెను. ఫకీరు మొగమున సంతోషముగాని వింతగాని లేదు. అపుడు ఉల్లా యిటు లనెను —'ఈ దీనుని యింట తమరు విందారగించుచో అల్లాను తృప్తిపఱతును!'.

ఫకీరు వెంటనే యిటులనెను: 'జనాబ్! ఖుదావంద్! నాకు అట్టి యిచ్ఛ కలుగలేదు. అది యటుండె. మీకు సంతతి లేదనుకొందును. అగునా? ఏమందురు? దయచేసి వెంటనే చెప్పుఁడు!'

'అగును.'

'వాత్సల్య మెఱుఁగనివాఁడు చేయువిందేమి విందు? మేఁకపోతు చన్నులను మేము చూడము.'

హిదాయతుల్లా మొగము మసిపాఁత యాయెను. అతఁడు ఆ మహాపురుషునకు వంగి వంగి సలాములు చేసికొనుచు వెనుక వెనుకకు వచ్చి వాకిటఁ బడెను. వాకిటికి వచ్చెనేకాని హిదాయతుల్లా కింటిదెసకు అడుగు పడలేదు.

హిదాయతుల్లా యింకను నాలుగడుగు లిడకముందే ఆ మహానుభావుఁడు తన గుడ్డను గోఁచిని సద్దుకొని అతని కనుల ముందఱగా ఆ పత్తనమునుండి లేచిపోయెను.

౨

హిదాయతుల్లా దర్శన మెవరికిని లేదు. అతఁడు సాకినా బీబీకిఁగూడ బీబీ యాయెను.

కొన్నాళ్లకా ఫకీరు వార్త సాకినా చెవిఁ బ్రాఁకెను. ప్రాఁకిన కొలఁదినాళ్లకే యామె తన కర్తవ్యమును నిశ్చయించుకొనెను.

హిదాయతుల్లా చీఁకటిగదిలో చింతాశయ్యాపయి పొరలాడుచుండెను. సాకినాబేగము గది గుమ్మముముందు నిలువఁబడెను.

సాకినాబేగము నిడుద నిట్టూర్పు హిదాయతుల్లాకుఁ దగిలెను. ఉల్లా వేఁడి నిటూర్పు సాకినా హృదయకమలమునకుఁ దగిలెను.

బేగము ఇటు లనెను: "గోరంతలు కొండంతలు చేయవలయునా? నే నీపనిని గోటిమీఁదఁ జేసియుండనా? మందనినచో మ్రాఁకే తెచ్చి యిచ్చియుందునా? వలయుచో నొక్క చూలాలిని దెచ్చి నిక్కా కట్టింతునే!"

బేగము హృదయము ఉల్లాకు అర్థము. అతఁ డానాఁడే లేచి పస్తు వదలి పథ్యము పుచ్చుకొనెను.

చీఁకటిగది తలుపులకు తాళము పడెను. బైరక్ ఖానా తలుపులకు తాళము తొలఁగెను.

బైరక్ ఖానాకు రుస్తుంసాహెబు అధిదేవత. తాళము తీయఁగనే దుంపలో పురుగువలె నతఁ డచట నావిర్భవించెను హిదాయతుల్లా ఆనందించెను. అతఁ డానందింపఁగనే ఆ వెనుకనున్న తన కన్నెను మెహరున్నీసాను ఖుర్బానీ పెట్టెను

ఆమలుసంజలో రుస్తుంసాహేబు తెర కొంచె మెత్తఁగనే మెహరున్నీసా తళుక్కుమని మెఱసెను. హిదాయతుల్లా కనులు మిఱుమిట్లు గొనెను. తెర వాలెను.

భరతవాక్యమునకు సాకినా వచ్చుచుండఁగా రుస్తుంసాహెబు ఓసరిల్లెను.

సాకినా తెర యెత్తెను. మెహరున్నీసా తలుపుచాటున కేఁగెను.

సాకినా 'దాఁగుడుమూఁత లేల?' అని పలికి మెహరును 'భాయీ' అని సంబోధించి రెట్టఁ గొని తీసికొని వచ్చి ఉల్లా ముందు నిలిపి 'సలాము చేయుము' అనెను.

ఉన్నీసా వడఁకుచు సలాము చేసెను. సాకినా మిగుల ఒద్దికతో మెహరున్నీసాకు సలాము చేసెను. ఉల్లా లేచి సాకినాకు సలాము కొట్టెను.

నాఁటినుండి మెహరున్నీసా *బుల్ బుల్ ఆయెను. రుస్తుంసాహెబు రొక్కపుదొర యాయెను. మహాపురుషుఁడు మాజీ మంత్రి యాయెను.

హిదాయతుల్లాకు సంవత్సర మొక దినమువలెఁ గడఁచెను. మహాపురుషుఁడు లేచిపోయిన రోజు మరల వచ్చెను.

రుస్తుంసాహెబును హిదాయతుల్లా తొలఁగించెను. మంత్రిని సాకినా తొలఁగించెను.

హిదాయతుల్లా మరల దుఃఖసాగరమున పానుపు పఱచెను. బైరక్ ఖానా మూఁతలు పడెను.

రుస్తుంసాహెబు మెహరున్నీసాను నోటి కొలఁది నిందించెను. మహాపురుషుఁడుగూడ నేర్పుకొలఁది నిందింపఁగా రుస్తుంసాహెబు చక్కఁగా సాయపడెను.

బైరక్ ఖానా బద్ధము కాఁగనే సదస్యులందఱకును ఉల్లావారి చింత యెల్లను

---

* కవులలో కోయిలవంటి పిట్ట.

తెలిసెను. మఱునాఁడే మన్సూరుసాహెబు తన కన్నియను దెచ్చి నజ రిచ్చెను.

మరల నొకయేఁడు గడఁచెను. ఆ యేఁటి నుండియు హిదాయతుల్లా తనకు ఏఁబదియేండ్లు వచ్చువఱకును ఏఁటేఁట నొక్కొక నజరును సంపాదించుచునే యుండెను.

అతనికి విసుగు కలుగనందులకు సృష్టికర్త సంతసించెను. ఏఁబదియొకటవ యేఁట ఉల్లాకు వచ్చిన కానుక హసీనా. హసీనా కొమరును గనెను. పుత్రోత్సవము ఉల్లాకే కాదు, జనానాకే కాదు, పత్తనమునకే కాదు, — ప్రజ కందఱకు గలిగిన నటు లుండెను.

హిదాయతుల్లా క్రొత్తశిస్తులతో పాటు ప్రాఁతశిస్తుల నన్నిటిని దీసివేసెను. చెఱసాలలను ఖాలీ చేయించెను. తనకుఁ గల ఖూనీ హక్కును విసర్జించెను.

మసీదు లన్నిట నవాఁజులు జరిగెను. ఆలయములలో అభిషేకము లాయెను. పల్లియలలోఁగూడ పంచదార బండ్లు తిరిగెను. ముసల్మానులకు ముసల్మానురాజ్యము హిందువులకు హిందూరాజ్యము దొరకెను.

తురకజోస్యులు హిందూజోస్యులును విడివిడిగా వ్రాసిన జాతకచక్రము లన్నియు ఏకీభవించెను. ఆయువు నూఱేండ్లు. రాజ్యలాభము రెట్టికి రెట్టి. విద్య నూటికి నూటొకటి. కళత్రస్థాన మిఱుకు, ఇఱ్ఱిఱుకు. పట్టినది బంగారము, మట్టినది మక్కా.

కాజీ వచ్చెను. జిన్, మారీద్, జాన్ అఫ్రిద్ మొదలగు తురకదయ్యములకు దుఆయి కట్టించెను. పురోహితుఁడు వచ్చి ఎన్నెమ్మలకు బ్రహ్మరాక్షసులకు షష్ఠీదేవికి భూతప్రేత పిశాచములకు రక్ష యిచ్చెను.

కాజీ పురోధల యనుమతితో హిదాయతుల్లా తన పసిఁబాపకు రహ్మత్ ఉల్లా అని నామకరణమహోత్సవము నొనరించెను. రహ్మత్ అనఁగా దైవకృప.

## 3

హిదాయతుల్లాకు మఱొక సంతానము నెడ కాంక్ష కలుగలేదు. కేవలునకు * బహుత్వమునందును అకేవలునకు † ఏకత్వమునందును కోరిక కాఁబోలు!

పెద్దభార్యను దక్క తక్కిన రాణివాసమును హసీనా వెడలఁగొట్టెను. పెద్దభార్యను ఉంచుటయేల? ఆమె పెద్దది. తాను చిన్నది. మఱియు ఆమె సాకి, నా; తాను హసీ, నా.

హసీనా కళాశాస్త్రము కైకొని రాఁగా ఉల్లా ఖురాను-ఏకరువులో నుండెడివాఁడు. సాకినా వచ్చి ఖురాను విని హసీనాకు కళాశాస్త్రము చెప్పించుచుండెడిది. ఇంతలో చిన్న ఉల్లా వచ్చి తండ్రి గడ్డము పీకి జపమాల లాగి

* (పరమేశ్వరునకు) ఒంటిగానికి.

† జీవునకు (బహుత్వములో కొట్టుకొనువానికి).

'ఒకటి నాలుగు ఏడు మూఁడు పసకొండు' అని పూసల లెక్కిడుచుండెడివాఁడు.

హిదాయతుల్లాకు ఒకచేతిలో కొడుకు, రెండవచేతిలో ఖురాను. ఒకకంట రాచ కార్యము, రెండవకంట పుత్త్రదర్శనము.

హిదాయతుల్లా అయిదుమాఱులు నవాజు చేయఁగా రహ్మత్ ఉల్లా పదిమాఱులు చేసెను. తండ్రి ఖురాను ఏకరువుపెట్టఁగా కుమారుఁడుగూడ కూడ కూడ నేకరువు పెట్టెను. పెద్దఉల్లా పాదప్రక్షాళన మొనరింపఁగా చిన్నఉల్లా పాదప్రక్షాళన మొనరించెను. తండ్రి రాచకార్యములను జూచి కుమారుఁడుగూడ భృత్యులయెదుట రాచకార్యములు నడపుట ననుకరించెను. చిన్నఉల్లా బాల్య మిటు లల్లాకుముద్దుగా నడచెను.

హిదాయతుల్లాకు షష్టిపూర్తి. నాఁడు రహ్మత్ ఉల్లా పడమటిదెస కభిముఖుఁడయి ఉత్తరమునుండి దక్షిణమునకు అక్కరములు వ్రాయ నేర్చెను. సూర్యాభిముఖుఁడయి కూరుచుండి దక్షిణమున నారంభించి ఉత్తరమునకు వ్రాయనేర్చెను. నేలపల్లి పలకలకును కొండపల్లి కాకితములకును ఖర్చు హెచ్చెను.

ఖురానంతయు వ్రాయుట కొక ముల్లాయు భారతమంతయు వ్రాయుట కొక పండితుఁడును నియమింపఁబడెను!

అతఁ డొకనాఁడు తనపేరు వ్రాసి తండ్రికడ రవ్వలయుంగరమును కానుక బడసెను. గుఱ్ఱ మెక్కి తల్లికడ నొక రంగణాను సంపాదించెను. తుపాకి ప్రేల్చి పెత్తల్లికడ ఖడ్గముఁ బడసెను.

అతఁడు బాలు రందఱకును పంతు లయిపోయెను, కాజీ అయిపోయెను, పండితుఁ డయిపోయెను, సేనానాయకుఁ డయిపోయెను.

రాజబాలకుఁడు జన్మముతోడనే పండితుఁడు, శూరుఁడు, కాజీ; కాని రాజత్వము తొలఁగించినను రహ్మత్ ఉల్లా పండితుఁడు, శూరుఁడు, కాజీ అని ముల్లా యనెను. ఉపాధ్యాయుఁడును అనెను. బాలు రందఱును అతని శూరతకు సాక్షులు. హిదాయతుల్లా పెద్ద సాక్షి.

అతనికి నేలంటు వదిలెను. పెద్దపెద్ద వ్రాఁతపుస్తకములు చేతికెక్కెను. పుస్తకములు చదివినకొలఁది క్రిందిమెట్టునుండి మీఁది మెట్టెక్కినటు లుండెను. అతఁ డిపుడు తేనెటీఁగ. ఆ తేనెటీఁగ వెనువెంటనే పెద్దతేనెటీఁగ హిదాయతుల్లా.

హిదాయతుల్లా మఱియొకతూరి బాల్య మనుభవించెను. కుమారునితో నవ్వెను. అతనితో పాంసుక్రీడ చేసెను. అతనితో విందారగించెను. అతనితో అక్షరములు దిద్ది పుస్తకము పట్టెను. అతనితో నాలోచించెను. అతనితో సాముచేసెను. తాను గుఱ్ఱమెక్కి యతని నెక్కించెను. తాను వ్యయము మాని కుమారుని కేఁటేఁట లక్షరూపాయలు ఇచ్చుచుండెను.

పంక్తిని కుమారుఁడు లేక అతఁడు ఆరగింపలేదు. కుమారుఁడు ప్రక్క నిదిరింపక తాను నిదిరింపలేదు. కుమారుఁడు నవాజు చేయక తాను జేయలేదు.

ఏ మహాపురుషుని యానడింపువలన నీ పుత్రుఁడు తన కొడవెనో ఆ మహాపురుషుఁ డెపుడో దర్శన మీఁ గలఁడని యతఁ డనుకొనుచుండెను.

౪

రహ్మత్ ఉల్లాకు తన బోడిగుండు బాగుండలేదు. అతఁడు జులపాలు పెంచి వంచి కట్టి ముచ్చిలిగుంటమీఁద తరంగములవలె వ్రాలునటులు కత్తిరింపించుకొనెను. తండ్రి కిష్టమును తన కడ్డము నగు గడ్డమును గొఱిగించుకొనెను. అతని మీసములు నిక్కఁబొడుచుకొని 'ఇట్టి విషయములలో నీవేమియు చెప్పరా' దని తండ్రిగారికి వేలెత్తి చూపుచున్నటులుండెను. చాపుఁ జక్కఁదనములతోఁ జేతులును, పొందిక పొంకపులతో మూఁపులును, తీరుతీయములతో కన్నులును, వట్రువదనముతో జవ్వుక్కుమను నడుమును, నడుమఁ బల్లముగను బ్రక్కల నాఁదోఁక మెరకగ వీఁపును, వెడఁదయు నిడుదయునగు నెడఁదయు నమరి యతఁడు మగవారినే మఱపించునటులుండెను.

అతఁడు చదువుకొనుచుఁ జదువుకొనుచు అడపముఁ దాల్చి ప్రక్కగా లోనికిఁ బోవు తాంబూలవల్లిని తలమెత్తి చూచెను. అతని వదన మెఱ్ఱఁబాఱెను.

పరభామలఁ జూడ రాదను చదువతనికి గుఱుతు వచ్చెను. తల వాల్చెను.

కొంత సేపటిలోనే లోనుండి తాంబూలవల్లి వెలువడెను. రహ్మత్ ఉల్లా తల మెత్తెను. ఇంతలో హిదాయతుల్లా కొడుకుఁగుఱ్ఱను జూడవచ్చెను. చిన్న ఉల్లా తల చివాలున ఖురానులోనికి వంగెను.

కుమారుని రాచపనులలో దిద్ది తీర్చుటకు అపుడచటికిఁ దండ్రి వచ్చెను. కుమారుఁడు వలరాచపనులలో ఓనమాలు దిద్ద మొదలిడెనని అమాయికుఁడు ఆ తండ్రి యెఱుఁగఁడు.

'నాయనా! జమాబందీ చేయింతువు గాని వత్తువా?'

'నేఁడు కాదు, ఱేపు.'

తండ్రి వెళ్లిపోయెను.

పన్నీరుబుడ్డి యెత్తుకొని జులేఖా అతని గది గూఁటిముందఱి నుండి నడచుచుండెను. రహ్మత్ ఉల్లా తల యెత్తెను. జులేఖా చూచెను. అతని హృదయగుహాలోని చీఁకటి కోణము లన్నియు తళుక్కుమనెను.

దేనికిని అంటి-ముట్టని అతని బాల్యమొక్కపరి గిర్రునఁ దిరిగి పోయెను. వింతలకును వంతలకును బునాదియు చలపాదియు నగు జవ్వనము రాజయి కూరుచుండెను.

అతఁడు బాల్య మిత్రములతో మాటాడుట మానివయిచెను. మగవారితో మాట

కొడుకు అతనికి మోటామెను. మగవారి మూతులు గోతులు. మగపురుగనిన నతనికి రోఁత పుట్టెను. అవేమో మగవారి కాళ్లు రోఁకళ్లు! వారి వక్షములు అక్షములు! వారి మోములు పాములు. వారి మేను మ్రాను. తుదకు తండ్రి దాపుగా వచ్చినను అతఁడు తూపాడిచెను. అతనికి మగవాఁడు ముదార్.

కుమారుని స్వాతంత్ర్యము తండ్రికి గోచరించెను. తన తండ్రి తన కీయఁటనే సకల స్వాతంత్ర్యము లిచ్చివేసెను. తానును పిత్రాచ్చార మవలంబించెను.

అన్నాళ్ళ నిపుడు కొడుకున కాహ్వానము లేదు. తనశయ్య తనగదియంద, తనయుని శయ్య తనయుని గదియంద. మున్ను గదుల విభాగము లేదు. నేఁడు తండ్రి గది; కొడుకు గది.

క్రమముగా నదియు మారెను. తండ్రి మేడ; కొడుకు మేడ. తండ్రికి ప్రాఁత మేడ కొడుకునకు క్రొత్త మేడ.

మును పొకఁడే పాచకుఁడు. ఇపు డిరువురు. మును పొకఁడే చాకలి. ఇపు డిరువురు. క్రమముగా నెవరి దాసీదాసము వారికి, ఎవరి పారా వారికి, ఎవరి పనులు వారికి, ఎవరి యధికారము వారికి. తుద కెవరికి వారు.

క్రొత్త మేడలోనికి వచ్చి ఇద్దఱు తల్లులును ముద్దుల బిడ్డని దీవించిరి. కుమారుఁడు సలాములు చేసెను. కొంచెము సేపుండి వారరిగిరి.

కుమారుఁడు దాపున లేమి తలిదండ్రులకు నిదుఁరపట్టలేదు. హిదాయతుల్లా లేచి అటిటు పచారుచేసెను. హసీనా లేచి 'మగవానిని కనరా'దని అనుకొనెను. 'దానఁ జేసియే నేను మానుకొంటి' నని సాకినా యనెను.

'నీ వేఁగి కుర్రనికడ శయనింపుము' అని హిదాయతుల్లా హసీనాతో ననెను. 'అనిన దే చాలునుగా' హసీనా పరువెత్తెను. హిదాయతుల్లా మేడమీఁదినుండి చూచుచుఁ జూచుచు 'సాకినా! ఇన్నాళ్ల కిటులు నీ కేకాంతము కలుగఁ జేయఁగలిగితిని' అని బొంకెను.

'ఏడవపదిలోఁగూడ నేకాంతమా? అగును లెండు. ఆఁడుది ముప్పదేండ్లకు ముసలి. మగవాఁ డెనుఁబదేండ్లకును ఎలఁ బ్రాయము వాఁడే. అయినను మనకీ యేకాంతము దక్కదు. హసీనా యెటులు పరువు లెత్తెనో యటులనే పరువులెత్తుకొని వచ్చును.'

'ఏల?'

'అంతియ.'

'కొంచెము వివరింపరాదా?'

'ఈ నడిరేయి వృద్ధ దంపతులమగు మనవలె నేపిన్నవారు తీరికగాఁ గూరుచుందురు?'

'నిక్కమే. అతఁడు గాఢనిద్రలో నుండి యుండును.'

ఇటులు వా రిరువురును మాటలాడుకొనుచుండఁగనే హసీనా వడివడిగా తిరిగివచ్చెను

'ఏమి?'

'పారా యిచ్చునది ఇరాక్ దేశముదిట! నతూర్ మహల్‌కా ఖాస్ బాంఁదీట! పేరు గులాప్ బేగమఁట! అది నన్ను పోనీయ నన్నది.'

'ఏల?'

'క్రొత్తహుజూరువారికి నిద్రాభంగము కాదా?'

'మంచిది. లేపుదు ననుకొంటిని.'

'మంచిదే. కాని రేపు మీ సీలును ఉంగరమును క్రొత్త హుజూరువారికి దాఖలు చేసికొని మీరు చేతులు కడుగుకొనుఁడు.'

హసీనా మాటల కతఁడు తెల్లఁబోయెను. కాని వెంటనే మాఱి 'ఇటు లందు వేల? అట్టి పుణ్యాహమునకే నే నెదురుచూచుచున్నాను' అనెను.

౫

హిదాయత్ ఉల్లాకు ఆంధ్రదేశము నందును మహారాష్ట్రదేశమునందును జాగీరులు కలవు. కుమారుని కనుభవము కలిగించుటకు అతఁడు పల్లియలలో గుడారము లెత్తించి జమాబందీ చేయించుచుండెను. అపుడు అతఁడు గుడారము లెత్తించిన దొక పెద్దపల్లె. దాని పేరు మునిపల్లె. అది పేరునకుఁ దగినది. కొండలంత కట్టలు గల యెఱ్ఱనీటి చెఱువు. దాని కానుకొని పల్లె. పల్లెచుట్టు పచ్చని కొండలు. తెల్లనివాఁగులు. జీబుచెట్లు. పల్లెనిండఁ జెట్లు. దొడ్ల నిండ తల్లియొఱ దాఁక నీరు దాఁకు బావులు. పచ్చని పుంతలు.

హిదాయత్ ఉల్లా నమాఁజునకుఁ గూరుచుండెను. రహ్మత్ ఉల్లా గుఱ్ఱ మెక్కి షికారు బయలుదేఱెను. మఱియొక గుఱ్ఱ మెక్కి అతని వెనుక నొక రోహిలా.

కదము త్రొక్కికొనుచుఁ బోయి గుఱ్ఱ మాఁగెను. ఎదుటఁ జెఱువు కట్ట.

'ప్రక్కదారిని బోవుద' మని రోహిలా యనెను. రహ్మత్ ఉల్లా గుఱ్ఱమును అడ్డముగాఁ ద్రిప్పి రోహిలామీఁద కొరడా విసరెను. పిదప నతఁడు గుఱ్ఱమును నిలువుగా త్రిప్పి తనగుఱ్ఱమును కొరడాతోఁ గొట్టెను. గుఱ్ఱ మొకనిమిషములో చెఱువుకట్ట యెక్కెను. రహ్మత్ ఉల్లా దానిని గొంచెము దూరము నడిపించి రోహిలాకొఱకు కాఁగెను. రోహిలా తనగుఱ్ఱమును చెఱువుకట్ట నెక్కింపలేక తన్నుకొనుచుండెను.

చెఱువుకట్ట క్రిందనే పెద్ద యగడిత. దాని కానుకొని పెద్ద గృహారామము. దాని పండ్లతో వంగిన దబ్బచెట్టు. దానిముం దొక బావి. బావిమీఁద ఆదబ్బపండ్ల చాయలోఁ గలసిపోయి నిలువఁబడిన పదునెనిమి దేండ్ల పడుచు.

రహ్మత్ ఉల్లా చూచి 'పాతాళకన్య' యనుకొనెను.

ఆమె వంగి నీరు చేఁదుకొనుచుండెను. ఆమె కుడిచేతితో చేఁద లాగి యెడమచేతఁ

ద్రాడు పట్టుకొనెను. కుడిచేతితో మరల లాగి యెడమచేతితో పయ్యంట దిద్దుకొనెను. పిదప నెడమచేతితోఁ ద్రాడుపట్టుకొని కుడిచేతితో చేఁదను వెలికి లాగెను. ఆమె చెక్కులమీఁద చెమరు ముత్తియములనారు.

ఆమె చేఁదను డించెను. 'నాకంటె నీ వేమి పచ్చగా నుంటివా? చూతము' అనునటులు ఆమె పసుపును అరచేతులతో అఱగరాచి మోమున నలఁతిగా పులుముకొనెను. మరల చేఁద వయిచి నీరు తోఁడి చేతులెత్తి అలవోకగా నొదవిన స్వస్తికముతో జలకమాడెను. ఇటులామె చేఁద వయిచి పయికి లాగి జలకమాడుచుండెను.

రహ్మత్ ఉల్లా ఒడలెఱుఁగక చూచుచుండెను. ఇంతలో నొక పెద్ద చప్పుడు! బ్రరు బ్రరు!

రోహిలా యెక్కినగుర్రము నాలుగు కాళ్లును ఆకాశమున కెత్తి వీఁపుతో సగము కట్టమీఁదినుండి గబగబ క్రిందికి నడచుచుండెను. రోహిలా గుర్రపు వీఁపు వదలకుండెను.

ఆఅవధారతో నడచుచున్న యీగుర్రపుఁ జప్పుడుతో రహ్మత్ ఉల్లా-నవాఁజునకు భంగము కలిగెను. వెనుదిరిగి రాకయుండుట కతనికి ఇసుమంతయు వీలులేకపోయెను. అతఁడు గుర్రమును మెల్లఁకువగా వెనుకకు త్రిప్పెను.

ఇంతలో రోహిలా లేచి తగులనున్న కొరడాదెబ్బలకు తయారగుటకుఁ బోలె పృష్ఠమును రెండుచేతులతో దులుపుకొనుచుండెను. ఎవరును నవ్వకముందే తానే నవ్వినటులు నకిలించి గుర్రము ఉడాయించెను.

ఏమియు ననక రహ్మత్ ఉల్లా మరల గుర్రమును ద్రిప్పెను. రోహిలా గుర్రమునకుఁ బోయెను. ఉల్లా చెఱువు క్రిందఁ జూచుచుఁ జూచుచు మునుపటిచోట గుర్రము నాఁపెను. వనదేవత లేదు. గుర్రము కొంచెము ముందటికి నడచెను. గ్రామనాయకుఁడు ఎదురు వచ్చెను.

'ఈదొడ్డి ఈయిల్లు ఎవరిది?'

'కరణముసాబ్ది హుజూర్ !'

'కరణమునకు పాకగతి యేమి?'

'కరణంగారు ఛాలా ధర్మాత్ములండీ హుజూర్! దానధర్మాలు చెయ్యడమే వారి పని. సంతులేదు. ఎవ్వరూలేరు. మూఁడో పెళ్లి బాబు! పాకయితే యేం దాని ముందు కోట బలాదూర్.'

రహ్మత్ ఉల్లా గుర్రమును నడిపించెను. గుర్రము విద్యుద్వేగముతో వెళ్లి పోయెను. వెనుక పరుగిడుచున్న నాయకుఁడు వగర్చి వెనుకఁ బట్టి దవాఖానాకుఁ * జేరెను.

రహ్మత్ ఉల్లా ఆ కొండలలో కట్టని కోటలను, 'ఆ వాఁగులలో త్రవ్వనితటాకము

* ఆసుపత్రి.

లను, ఆపచ్చని పొదలలో పన్నని గుడారములను జూచెను. చూచి చూచి చప్పరించెను. వెనుదిరిగెను. చెఱువుకట్టమీఁదుగా వచ్చి శూన్యమగు ఆ గృహోద్యానమును పరికించుచు నిర్గమించెను.

కాకితముల నన్నిటిని జూచి అనుక్రమణిక యేర్పఱచి బల్లమీఁద నుంచి హిదాయతుల్లా ఓసరిల్లెను.

కొలఁదికాలముననే రహ్మత్ ఉల్లా వచ్చి కాకితములఁ జూచికొనెను. కాకితమున (నిలువయున్న) డబ్బు ఖజానాలో లేదు.

ప్రొద్దు వ్రాలెను. హిదాయత్ ఉల్లా నవాఁజులో నుండెను. రహ్మత్ ఉల్లా కరణమును నాయకుని గ్రామ నౌకరులను బండకొయ్యలలో వేయించెను. తాను జోయి పానుపును ఆశ్రయించెను.

౬

తాంబూలవల్లి వచ్చి రహ్మత్ ఉల్లా ముందు వెలవెలఁ బోయెను. ఉల్లా తటాలున లేచి కూరుచుండెను.

తాంబూలవల్లి యిటు లనెను—'మహారాజా! మార్తండతేజా! కరణముగారి భార్య అల్లాబకీనుకన్న మిన్న. ఎటు లందువా? విను:

'గీ. సంధిసేసిన సర్వస్వ సంక్షయంబు
యుద్ధమొనరింపఁ బ్రాణంబు లుండఁబోవు
అల్ల యల్లాబకీనరాణ్మల్లుతోడ
కుదుర దల సంధి, యుద్ధముం గుదురఁబోదు. *'

'ఇఁక నీమె యన్నదికదా విను:—సంధులు లిఱుగవలయుచో సంధి. ప్రాణదానము చేయుచో దానము. శరీరభేదముతో భేదము. ఇట్టులు మనకుఁ గాని తనకుఁ గాని దండోపాయమునే మిగిల్చినది.'

'ఏమీ?' అని రహ్మత్ ఉల్లా ఉఱికెను. తాంబూలవల్లి యేమియు చేయును? తల వాల్చెను.

రహ్మత్ ఉల్లా పకపక నవ్వి, 'వట్టి తమలపుటాకు వట్టితమలపుటాకు' అనెను. కొంచెము యోచించి, 'రోహిలాలను పిలుతువా?' అనెను.

'ఏర్పాటు చేసియే సెలవుకొఱకు వచ్చితిని.'

'సెబాస్, మంచిది. ఏరికిని దెలియరాదు.'

'అది అక్కఱ మాలిన మాట.'

'సరి, యేమి చేయింతువు?'

'అరఁటిపం డొలిచి నిన్నుఁ బిలుతును. ముసలి పులి మాత్రము కనుకవలయును.'

'దాని కెపుడును కోరలు లేవు. మనకు దాని భయమే లేదు.'

'మంచిది.'

---

* సంధౌ సర్వస్వహరణం విగ్రహే ప్రాణనిగ్రహః, అల్లాబదీననృపతౌ న సంధి ర్న చ విగ్రహః.

తాంబూలవల్లి జారెను. ప్రాంతగుడార ములో భగవత్ ప్రార్థన పరిసమాప్తమాయెను.

ఇంతవఱకును కిటకిటలాడుచున్న వీథు లన్నియు బంగనబయ ళ్లయిపోయెను. ఏక్షణ మున నేమి జరుగునో యెవరికిఁ దెలియును? వెలుఁగు చీఁకటి యగును.చీఁకటి వెలుఁగగును. అష్టమీ చంద్రరేఖ అపుడపుడ ఆకాశవీథిని అశూన్య మొనరించెను. చుక్కలు ఒకచ క్కని చుక్కను పరికించుటకుఁబోలె వరుసలు దీఱి కూరుచుండెను.

రహ్మత్ ఉల్లా కంట వత్తిడికొని కూ రుచుండియుండెను. అతనికి నిమిష మేఁడాదిగా నుండెను. ఏమియు తోఁచలేదు. గులాపీ అని పిలిచెను. బదులు లేదు. జులేఖా యని పిలి చెను. మాఱుమాట లేదు. కాని గుడార ములో పదధ్వనియు, వెంటనే 'నన్నుఁ బిలువ లేదేమి?' అను వాక్యమును వినిపించెను. రహ్ మత్ ఉల్లా మొగము చేటంత ఆయెను. 'ఇఁక నీదే పని.'

రహ్మత్ ఉల్లా గుడారము బయటి కేఁగెను. జీను కట్టిన గుర్రమచట వేచియుం డెను. తాంబూలవల్లి చేతి యూఁతతో నతఁడు గుర్రముమీఁది కెగిరి దూఁకెను. గుర్రము గొప్ప సకిలింతతో కోలాహలము చేయుచుఁ బరువిడెను. దానివెనుక గజ్జెలగుర్రమువలె తాంబూలవల్లి నడచెను.

'అల్లాహ్ అల్లాహ్'అనుకొనుచు హిదా యతుల్లా లేచెను. వాకిటికి వచ్చి చూచెను. కికారణ్యము!

'గులాపీ ?'

'ం.'

'జులేఖా ?'

'ం.'

'తాంబూల్ '?

'ం.'

'సులేమాన్ ?'

'ం.'

హిదాయతుల్లా గుడారముల చుట్టును దిరిగెను. వంటవారు నిదురించుచుండిరి. బండ కొయ్యలలో నున్నవారు బండకొయ్యలలోనే నిదురించుచుండిరి. సైనికుఁ డొకఁడును లేఁడు. అతఁ డంతయు కలయఁజూచి అపాయమును శంకించెను. పటాకత్తి దూసి గుర్రమెక్కెను. గుర్రము సకిలించెను. ఈసకిలింత విని రహ్ మత్ ఉల్లా-గుర్రము దూరముగా సకిలిం చెను. నిమిషములమీఁద హిదాయతుల్లా- గుర్రము రహ్మత్ ఉల్లా గుర్రమును చేరఁ బాఱెను. కరణముగారి యింటిని జుట్టవయిచిన రోహిలాలు చెట్టు కొకఁడును పుట్ట కొకఁడు నయిరి.

తలుపు లింకను మూయఁబడలేదు. హి దాయతుల్లా గుర్రము దమికి లోనికిఁ బరు గెత్తెను.

నడుమునుండి దూసిన ఒడ్డాణపు బాకు తో ఆ పడుచు. దాని తాఁకును తప్పకొను

తాంబూలీ గులాపీ జులేఖాలు. దానిని లాగుకొనుటకుఁ బొంచియున్న కొడుకు. ఈ రంగమంతయు నతఁ డరసెను.

అతని జూచుచునే దాసికలు దాఁటిరి. కొడుకు కత్తితో తండ్రిమీఁదికి లంఘించెను. బోసిపులి చిఱుతపులిని గ్రిందఁ బడఁద్రోసెను. పిదప మోఁకాలు మండెవెట్టి తండ్రి కొడుకుగుండెలమీఁదఁ గూరుచుండెను. కూరుచుండి 'అమ్మా! ఇఁక రమ్ము ఖూనీసెలవు పోఁగొట్టుకొంటిని. వీనికి నీ కత్తితోడనే నీవు శిక్ష విధింపుము' అనెను.

ఆయమ వచ్చి తండ్రికొడుకుల కత్తులు లాగుకొని 'ఇతనిని నేను క్షమించితిని' అనెను.

'అమ్మా! నీవు దయావతివి. ఈ ముసలి కఠినుఁడు?' అని కొడుకుగుండెలలో నొకపోటు పొడిచి మీఁదినుండి లేచి అతనిని లేవఁదీసెను. లేవఁదీసి బయటి కొక గెంటు గెంటెను. గెంటి యొడలు పట్టునన్ని దెబ్బలు కొరడాతోఁ గొట్టెను. కొట్టి—'నాకిఁక కొడుకు లేఁడు. నీవు నా కిఁకఁ గానరారాదు' అనెను.

వదిలినదే చాలునుగా రహమత్ ఉల్లా పాఱిపోయెను. హిదాయతుల్లా కానఁబడునంత వఱకును కుమారుని జూచి చేతులెత్తి 'ఓ ఫకీర్ ఓ ఫకీర్! ఓరినాయనా! ఓరినాయనా' అని ఆవఱచినటు లఱచెను.

---

## ప్రాకృతగాథలు

రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారు

(అనువృత్తము)

*ఎవరి కలుక రాదు భువిఁ బ్రియురాలి కె
మ్మోవి కాటువడిన? ముగుద, తేంట్లు
మూఁగియున్న తమ్మి మూరుకొంటివి; వల
దన్న వినవు; సైఁపవమ్మ, యిపుడు.

—కావ్యప్రదీపము, పు. ౧౬౦.

తెల్లవాఱెఁ జెమట దీయించుకొన్నాఁడు;
ఒడలు గడిగినాఁడు; కుడిచినాఁడు;
జోస్యుకడకు దినముఁ, జుక్కయు, వారము
నడుగఁ బల్లెపెద్ద వెడలినాఁడు!

—అదే, పు. ౨౩౭.

ఆదరించి సహృదయాళి చేపట్టిన
యపుడె గుణములెల్ల నంకురించుఁ;
తరణికిరణములను దడవినప్పుడుగదా
తమ్మిపూవు లగును దమ్మిపువులు!

—అదే, పు. ౨౬౧. †

---

* దీని మూలగాథకే 'వారణసేయఁదావకొనవా' ఇత్యాది శ్రీనాథుని యాంధ్రీకరణముగాఁ దోఁచెడిని. ఇది హాలుని సప్తశతిలోనిదఁట. కాని నిర్ణయసాగరపుముద్రణములో కానరాదు.

† దీని మూలగాథ ధ్వనికారుఁ డగు ఆనందవర్ధనాచార్యుని "విషమబాణలీల" లోనిదఁట.

—చూ. ధ్వన్యాలోకము, పు. ౬౨.